సాక్షి
పెద్దపల్లి
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

జిల్లాలోని వినాయక మంటపాల్లో శుక్రవారం మహిళా భక్తులు కుంకుమ పూజలు అత్యంత వైభవంగా జరిపారు. తమ పసుపు, కుంకుమలను కలకాలం చల్లంగా చూడాలని గణేశునికి మొక్కుకున్నారు. అనంతరం వాయినాలు ఇచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లోనూ మహిళలు అత్యంత వైభవంగా కుంకుమ పూజలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



న్యూస్‌రీల్

రైల్వే ఫ్లైఓవర్‌పై గడ్డర్ల ఏర్పాటు



గడ్డర్లు ఏర్పాటు చేస్తున్న క్రేన్లు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ సమీప రైల్వేఫ్లైఓవర్‌పై శుక్రవారం గడ్డర్(పిల్లర్)లను ఏర్పాటు చేశారు. దాదాపు 10ఏళ్లుగా రాజీవ్ రహదారి వద్ద రైల్వేఫ్లైఓవర్‌పై వంతెన నిర్మాణం ముందుకు సాగడంలేదు. దీంతో ఫోర్ లైన్‌కు బదులు డబుల్‌రోడ్డుపైనే రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చొరవతో గతేడాది పనులు పునరుద్ధరించారు. ఇందులో భాగంగానే గడ్డర్లు ఏర్పాటు చేశారు. శనివారం మరో రెండు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో రైల్వే అధికారులు ఏడీఎన్ గుప్తా, రాంబాబు, శ్రీనివాస్, రమేశ్ బాబు, పీవీ రావు, రామకృష్ణారావు, విజయ భాస్కర్‌రెడ్డి, హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ప్రగతి పుస్తకం



పుస్తకం పరిశీలిస్తున్న డీపీవో చంద్రమౌళి

పెద్దపల్లిరూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ముద్రించిన పుస్తకాలు జిల్లాకు చేరాయి. వీటిని జిల్లాలోని 267 గ్రామ పంచాయతీలకు అందించామని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి శుక్రవారం సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

ఓదెల(పెద్దపల్లి): విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బుర్ర శ్యాం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం డీటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వనమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, పీఆర్సీ వేసి, వెంటనే ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలను ఇప్పించాలన్నారు. బిల్లుల విడుదల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని ఆయన విన్నవించారు. ఈకార్యక్రమంలో జోన్ బాధ్యుడు రవీందర్‌రెడ్డి, మండల బాధ్యులు మోహన్, సురేశ్, రాము, రాష్ట్ర కౌన్సిల్ అమృత్‌కిశోర్ పాల్గొన్నారు.

'ఈ చేపలు మాకొద్దు'



నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ఎలిగేడు(పెద్దపల్లి): వివిధ గ్రామాల్లో చేపపిల్లలు పంపిణీ చేసేందుకు అధికారులు శుక్రవారం సన్నద్ధం కాగా మత్స్యకారులు నిరసన తెలిపారు. సైజ్ చిన్నగా ఉన్నాయని, నాణ్యత లోపించాయని, వీటిని చెరువుల్లో వదిలితే ఎదుగుదల ఉండవని వారు పేర్కొన్నారు. వాటిని తిరిగి వెనక్కి పంపించి వేశారు. తమకు నాణ్యమైనవి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్లు సబ్బు మల్లయ్య, ఐలవేని వీరస్వామి, ఎలిగేడు మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు రాయనవేణి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సబ్బు శ్రీధర్, నాయకులు యాదగిరి రవి, పాలవేణి మొండయ్య, రేండ్ల కనుకయ్య, దూడి పోచాలు, నాయణవేణి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనికి చెందిన రఘువీర్(35)కు వారం క్రితం తీవ్రమైన జ్వరమొచ్చింది. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు డెంగీగా నిర్ధారించి ఆ వెంటనే అడ్మిట్ చేసుకున్నారు. ప్లేట్‌లెట్ల సంఖ్య లక్షకు పడిపోయాయి. దీంతో తక్షణమే ప్లేట్‌లెట్లు ఎక్కించాలని చెప్పి హడావుడి చేశారు. వారంపాటు ఆస్పత్రిలో ఉంచి.. నయమైందని చెప్పి అతడిని డిశ్చార్జి చేశారు. రూ.90వేల వరకు బిల్లు చెల్లించాల్సి రావడంతో పేషెంట్ బిత్తరపోయాడు.

'జ్వరం వస్తే ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించాం. డెంగీ పాజిటివ్ వచ్చిందన్నారు. అడ్మిట్ చేశాం. వారం తర్వాత డిశ్చార్జి చేశారు. రూ.70 వేల బిల్లయ్యింది' అని పెద్దపల్లికి చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒకరు వాపోయాడు.

ప్లేట్‌లెట్స్ ఎప్పుడు ఎక్కించాలంటే..

- ప్లేట్‌లెట్ల సంఖ్య 20 వేల కన్నా తగ్గినప్పుడు..
- ఇంటర్నల్ బ్లీడింగ్, మోషన్ బ్లాక్‌గా కావడం, ముక్కులో నుంచి రక్తం కారడం, శరీరంపై మచ్చలు ఏర్పడడం వంటి లక్షణాలు ఉంటే..

ప్రైవేట్ ఆస్పత్రులు ఏం చేస్తున్నాయంటే..

- సాధారణ జ్వరం వచ్చినా డెంగీ పేరిట అడ్మిట్..
- ప్లేట్‌లెట్స్ సంఖ్య 60వేల నుంచి లక్ష వరకు ఉన్నా ఎక్కిస్తున్నాయి..

డెంగీ పేరిట దోపిడీ!

- సాధారణ జ్వరానికీ డెంగీ అంటూ ఆస్పత్రిలో అడ్మిట్
- ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గిందంటూ జేబులు గుల్ల
- పేషెంట్లను పిండేస్తున్న ప్రైవేట్ దవాఖానాలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



జ్వరపీడితులతో కిక్కిరిసిన పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రి

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పిల్లలు, యువత, వృద్ధులు అనే తేడా లేకుండా అందరూ తీవ్ర అస్వస్థతకు గురవుతూ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వీరిరాకతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. అయితే, సర్కారు దవాఖానాల్లో సౌకర్యాలు సరిగా లేక చాలామంది ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. దీనిని అదను తీసుకుంటున్న కొందరు వైద్యులు.. 'మీ కండీషన్ సీరియస్‌గా ఉంది.. ప్లేట్‌లెట్స్ పడిపోయినయ్' అంటూ భయపెడుతున్నారు. సాధారణ జ్వరంతో ఏ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినా ఇదే మాట వినిపిస్తోంది. సీజనల్ వ్యాధులు వస్తే చాలు.. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు పండుగే. వానాకాలం వారికి కాసుల వర్షం కురిపించే సీజన్‌గా మారుతోంది. మామూలు జ్వరంతో అని వెళ్లినా సరే.. రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు తగ్గకుండా మందులు(ఔషధాలు) రాస్తున్నారని బాధితులు వాపోతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 148 డెంగీ కేసులు నమోదయ్యాయని అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నవారిని పరిగణనలోకి తీసుకోవడం లేదని, దీంతో డెంగీ కేసులు తక్కువగా నమోదవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

నాలుగో దశ ప్రమాదకరం

- పగటివేళ కుట్టే ఎడిస్ ఈజిప్టి దోమకాటుతో డెంగీ వస్తుందని వైద్యులు చెబుతున్నారు.
- ఇది మొదటిదశ జ్వరమని, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కళ్లు ఎర్రగా మారుతాయంటున్నారు.
- రెండోదశలో ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గటం, జ్వరం, వాంతులు, కాళ్లు వాపులు వస్తాయి.
- మూడోదశలో బీపీ తక్కువ కావడం, ప్లేట్‌లెట్స్ తగ్గటం, శరీరంపై మచ్చలు ఏర్పడతాయి.
- నాలుగో దశలో పేషెంట్లకు కామెర్లు రావటం తోపాటుగా షాక్‌లోకి వెళ్తాడు.
- బీపీ తగ్గటంతోపాటు కిడ్నీల పనితీరు మందగించి రక్తం బయటకు పోతుంది.
- నాలుగో దశను డెంగీ హెమరేజ్ షాక్ సిండ్రోమ్ అంటారు.
- మొదటి మూడు దశల్లో భయపడాల్సిన పనిలేదు.

20వేల కన్నా తగ్గితేనే..

సాధారణంగా ఆరోగ్యవంతుని శరీరంలో ప్లేట్‌లెట్ల సంఖ్య 1.5 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుంది. డెంగీ బారినపడితే వీటి సంఖ్య తగ్గుతుంది. 20 వేల కన్న ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గినప్పుడే ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువశాతం మందిలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గుదల ప్రారంభమైన మూడోరోజులు తర్వాత నుంచి ఇచ్చే యాంటీబయాటిక్స్, ఇతర మందులతో సంఖ్య పెరుగుతుందని వివరిస్తున్నారు. దీంతో భయపడాల్సిందేమీలేదని పేర్కొంటున్నారు.

అపోహలు వీడండి



ఎలాంటి జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గటం సహజం. సాధారణంగా రక్తంలో 2 లక్షల నుంచి 4.5 లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేల కన్నా తక్కువగా ఉన్నా ప్రమాదం లేదు. డెంగీ కేసుల్లో 10శాతం మందికే ఆస్పత్రిలో అడ్మిషన్ అవసరం. కానీ, చాలామంది జ్వరం వచ్చిన మరుసటిరోజే వెళ్లి డెంగీ టెస్ట్, సీబీపీ చేయించుకుంటున్నారు. నాలుగైదు రోజుల తర్వాత కూడా ఫీవర్ అలాగే ఉంటే, అప్పుడు టెస్టులు చేయించుకోవాలి.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

'స్పౌజ్' దుర్వినియోగంపై విద్యాశాఖ ఫైర్!

- టీచర్ల అక్రమ బదిలీల ఫిర్యాదులపై ఆరా
- ఆప్షన్లు పరిశీలించాలని డీఈవోలకు ఆదేశాలు
- చర్యలు తీసుకోవాలన్న విద్యాశాఖ కమిషనర్ దేవసేన
- టీచర్ల బదిలీల్లో అక్రమాలను వెలికితీసిన 'సాక్షి' దినపత్రిక



సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే గవర్నమెంట్ హెడ్‌మాస్టర్(జీహెచ్‌ఎం) బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై విద్యాశాఖ స్పందించింది. దంపతులిద్దరూ ప్రభుత్వ టీచర్లు అయి బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో భార్యాభర్తలు ఒకే దగ్గర పనిచేసేందుకు వారికి ప్రత్యేకంగా 10 పాయింట్లు కేటాయించింది. ఈ పాయింట్లు ప్రత్యేకంగా వినియోగించుకుని స్పౌజ్ టీచర్లంతా ఒకే చోట పనిచేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. కానీ... ప్రభుత్వ ఉద్దేశానికి తూట్లు పొడుస్తూ చాలా మంది జీహెచ్‌ఎంలు వారి భార్య/భర్త వద్దకు కాకుండా తమకు నచ్చిన చోటుకు బదిలీ కోసం ఈ పాయింట్లను వాడుతున్నారు. ఈ విషయాన్ని ఈనెల 20వ తేదీన ×సార్లూ.. ఇది తగునా₹ శీర్షికన పలువురు జీహెచ్‌ఎంలు నిబంధనలకు విరుద్ధంగా చేసుకున్న దరఖాస్తుల తీరును ×సాక్షి₹ వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై నాన్‌స్పౌజ్ టీచర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు సాక్షి కథనం రేపిన దుమారంపై జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లోని జిల్లా విద్యాశాఖ అధికారులు(డీఈవోలు) అప్రమత్తమయ్యారు. జీహెచ్‌ఎంలు నిబంధనలకు విరుద్ధంగా చేసుకున్న ఆప్షన్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన దృష్టికి తీసుకెళ్లారు.

చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

కేంద్ర, రాష్ట్ర, లోకల్‌బాడీల్లోని భార్యభర్తలైన టీచర్లు ఒకే చోట పనిచేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పది పాయింట్ల విధానాన్ని తీసుకొచ్చింది. అయితే పలు చోట్ల అక్రమాలు జరుగుతున్నాయన్న ×సాక్షి₹ కథనంపై స్పందించిన దేవసేన రాష్ట్రంలోని అన్ని డీఈవో కార్యాలయాలను అప్రమత్తం చేశారు. ఇప్పటి వరకు చేసుకున్న జీహెచ్‌ఎం దరఖాస్తుల్లోని ఆప్షన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. వారిలో భార్య లేదా భర్త పనిచేస్తున్న చోటుకు కాకుండా దూరంగా దరఖాస్తు చేసుకున్నా.. పాయింట్లను దుర్వినియోగం చేసిన వారిని గుర్తించి వెంటనే వారికి కేటాయించిన 10 పాయింట్లు రద్దు చేయాలని, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

ఎందుకు దుర్వినియోగం?

- కేవలం జిల్లా కేంద్రాల్లో నివసించాలని, తమ పిల్లలకు మంచి విద్య, వైద్యం అందాలన్న ఆలోచనలతో చాలా మంది స్పౌజ్ టీచర్లు భార్య/భర్తకు దూరంగా ఉన్న పాఠశాలను ఆప్షన్‌గా ఎంచుకుంటున్నారు.
- స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగానికి అధిక హెచ్‌ఆర్‌ఏ మరో కారణమని నాన్‌స్పౌజ్ టీచర్లు ఆరోపిస్తున్నారు. అర్బన్, సెమీఅర్బన్, రూరల్ ప్రాంతాల్లో వచ్చే హెచ్‌ఆర్‌ఏ విషయంలో వ్యత్యాసాల కారణంగా స్పౌజ్ టీచర్లంతా తప్పుదారి పడుతున్నారని మండిపడుతున్నారు.
- కాంప్లెక్స్ పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సి రావడం ఇబ్బందిగా భావిస్తున్నారు. కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు బిల్స్ నిర్వహణ, వేతనాలు చెల్లింపు, సెలవుల పట్టీ, సర్వీసు పుస్తకాల రికార్డుల నిర్వహణ తదితర కారణాలతో పని ఎగ్గొట్టేందుకు వీరు కాంప్లెక్స్ పాఠశాలలను ఎంచుకోకుండా మరో చోటుకు వెళ్తున్నారు.
- భార్య/భర్త జీహెచ్‌ఎంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసేందుకు స్పౌజ్‌లు ఇబ్బంది పడుతున్నారు. తమ భర్త/భార్య ఆదేశాలు పాటించడం ఇష్టంలేని వారు అవే పాయింట్లు వినియోగించుకుని స్పౌజ్‌కు దూరంగా వెళ్తున్నారు.

నేడు రామగుండం మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్

సాక్షి ఫోన్ ఇన్



కోల్‌సిటీ: 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్‌తో ఫోన్‌ఇన్ కార్యక్రమం ఉంటుంది. డెంగీ, పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర సమస్యలు ఉంటే తెలియజేయాలి. వీటి పరిష్కారానికి కమిషనర్ సమాధానం ఇస్తారు.

సమయం : శనివారం : ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 98499 05878

సింగరేణి ఎన్నికలపై నీలినీడలు

- నేటి సమావేశం 27కు వాయిదా
- 'గుర్తింపు'పై హైకోర్టు తీర్పు రిజర్వ్
- అన్ని కార్మిక సంఘాల సమాన ప్రాతినిధ్యంపై ఉత్తర్వులు



సమావేశమైన కార్మిక సంఘాలు, యాజమాన్యం

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై నీలినీడలు అలుముకున్నాయి. ఎన్నికలపై వాయిదాల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎల్‌సీ సమక్షంలో కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యం జరిపిన చర్చలు ఈనెల 27కు వాయిదా పడ్డాయి. ఈనెల 13న నిర్వహించిన సమావేశంలో ఈనెల 21న గుర్తింపు ఎన్నికలకు వెళ్లేందుకు కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో డిప్యూటీ సీఎల్‌సీ కూడా ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించింది. సమావేశానికి ఆలస్యంగా హాజరైన సింగరేణి డైరెక్టర్(పా) బలరాం 21న వేజ్ బోర్డు ఎరియర్స్ చెల్లిస్తున్నామని, ఎన్నికలు అప్పటి దాకా వాయిదా వేయాలని కోరారు. ఎరియర్స్ చెల్లింపు తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోవచ్చన్నారు. ఈక్రమంలో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే సమావేశానికి రెండు రోజుల ముందే సింగరేణి సంస్థ.. హైకోర్టులో రిట్ వేసింది. రెండురోజుల పాటు వాదోపవాదాలు విన్నతర్వాత హైకోర్టు తీర్పును రిజర్వ్‌లో పెట్టింది.

సమావేశం ఈనెల 27కు వాయిదా

కోర్టు తీర్పు రిజర్వ్ కావడంతో సమావేశాన్ని ఈనెల 27కు వాయిదా వేయాలని సింగరేణి యాజమాన్యం తరఫున హాజరైన డైరెక్టర్(పా) బలరాం కోరారు. దీనిపై అన్నికార్మిక సంఘాలు సానుకూలంగా స్పందించాయి. అయితే ఏఐటీయూసీ, బీఎంఎస్ వ్యతిరేకించాయి. మినిట్స్‌పై ఈ రెండు యూనియన్లు సంతకాలు కూడా చేయలేదు.

అన్ని సంఘాలకు సమాన ప్రాతినిధ్యం

సింగరేణిలోని 14కార్మిక సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీచేసింది. ఈమేరకు సర్క్యులర్ విడుదల చేసింది. దీంతో కార్మిక సంఘాలు శాంతించాయి. ఎన్నికలు నిర్వహించేంత వరకూ అన్ని కార్మిక సంఘాలను సమావేశాలకు ఆహ్వానించాలని ఆదేశాలు అప్పటికప్పుడే జారీ చేసింది.

కోర్టు తీర్పుపైనే నిర్ణయం

హైకోర్టు తీర్పుపైనే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో పలు దఫాలుగా వాయిదా పడుతూ వస్తోంది. మూడురోజుల క్రితం హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన యాజమాన్యం.. అసెంబ్లీ ఎన్నికలు వాయిదాపడేంత వరకూ గుర్తింపు సంఘం ఎన్నికలు నిలిపివేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించింది. ఈక్రమంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. తన తీర్పును రిజర్వ్‌లో ఉంచడంతో ఎన్నికలపై స్పష్టత రాలేదు. సమావేశంలో ఐదు జాతీయ కార్మిక సంఘాలతోపాటు మరో 9రిజిస్టర్డ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడికి ఆపద

- రైలుప్రమాదంలో తీవ్రగాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగేశ్
- దాతల సాయం కోసం ఎదురుచూపు



ప్రమాదంలో గాయపడిన నగేశ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనికి చెందిన సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకుడు, విద్యావేత్త దుర్గం నగేశ్ ఈనెల 13న హైదరాబద్ నుంచి రామగుండం వరకు రైలులో వస్తుండగా బిజిగిరి షరీఫ్ వద్ద కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. మిత్రులు, కుటుంబసభ్యులు సకాలంలో స్పందించి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యం కోసం ఇప్పటివరకు రూ.4 లక్షలకుపైగా ఖర్చయ్యింది. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించారు. ఒక కాలును మోకాలు వరకు, మరోకాలి వేలును పూర్తిగా వైద్యులు తొలగించాల్సి వచ్చింది.

సాయం కోసం విన్నపాలు..


నేనున్నానంటూ ఉన్నదాంట్లో కొంత పేదలకు సాయం చేసిన నగేశ్.. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. కరోనా కష్టకాలంలో పేదలకు నిత్యావరాలు అందించారు. ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా సాయం చేయడమే కాదు.. నేనున్నానని భవిష్యత్‌పై భరోసా కల్పిస్తున్నారు. ఇలాంటి ఆపద్బాంధవునికే ఆపద వచ్చింది. ఆర్థిక సాయం కోసం దాతలను వేడుకుంటున్నారు.

దాతలు ఎవరైనా స్పందిస్తే..

దుర్గం నర్సయ్య, సీనియర్ రిటైర్డ్ మేనేజర్(ఎన్టీపీసీ రామగుండం)
ఫోన్‌పే, గూగుల్ పే నంబరు : 94404 23862
దుర్గం విశ్వనాథ్, సమతా ఫౌండేషన్ : 90001 37701

దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి ప్రజావాణి దరఖాస్తులు, ధరణి, గృహలక్ష్మి, ఓటరు జాబితా సవరణ దరఖాస్తులు, మీ సేవా తదితర అంశాలపై సమీక్షించారు. ఓటరు జాబితా సవరణ కోసం వచ్చిన అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈనెల 25 లోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతరులకు అన్ని వసతులు కల్పించాలని చెప్పారు. గృహలక్ష్మి లబ్ధిదారులను ప్రజాప్రతినిధుల సమన్వయంతో త్వరితగతిన ఎంపిక చేయాలన్నారు. ధరణి ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు. అధికారులు మధుమోహన్, హనుమానాయక్, శ్రీనివాస్, పుష్పలత పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేస్ట్ టు వండర్ పోటీలు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థలో చెత్త నుంచి అద్భుతాలు(వేస్ట్ టు వండర్) సృష్టించే పోటీలు నిర్వహిస్తామని మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వేస్ట్ టు వండర్ ప్రచార పోస్టర్‌ను శుక్రవారం మేయర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆసక్తి గలవారు ఈనెల 27లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనడానికి అందరూ అర్హులేనని తెలిపారు. చెత్త వృథా కాదని, దానినుంచి ఏదోఒక వస్తువు తయారు చేసి తిరిగి ఉపయోగించుకోవచ్చని నిరూపించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. పేర్లు నమోదు చేసుకున్నవారు, చెత్త నుంచి తాము తయారు చేసిన వస్తువులను ఈనెల 29న నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రదర్శనకు ఉంచాలన్నారు. వాటిలోంచి ఉత్తమమైనవి ఎంపిక చేసి బహుమతులు అందిస్తామని చెప్పారు. పేర్ల నమోదు కోసం 94944 58748, 90009 46169 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పేర్లు తొలగించండి

సుల్తానాబాద్(పెద్దపల్లి): గ్రామాలు, పట్టణాల్లో స్థానికంగా ఉండని వారిపేర్లు తొలగించాలని పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. ఈనెల 23 నుంచి 26వ వరకు ఇంటింటా పర్యటించి ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని చెప్పారు. దివ్యాంగులు, 80ఏళ్ల పైబడిన వారి జాబితా సిద్ధం చేయాలని వివరించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

'నియామకం సరికాదు'

రామగిరి: సింగరేణి భవన్‌లో ప్రైవేట్ టెండర్ ద్వారా క్లరికల్ సిబ్బంది నియామకం సరికాదని పేర్కొంటూ శుక్రవారం ఆర్జీ–3 ఎస్‌వోటూ జీఎం రఘుపతికి సింగరేణి కాలరీస్ క్లరికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు బొల్లం మధు, బి.పోశయ్య, కెన్నిఎంఫ్రాన్సిస్, కంది రమ్య, మల్లిక, జ్యోతి, వేదశ్రీ పాల్గొన్నారు.

క్వార్టర్ల కౌన్సెలింగ్

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో జీఎం సుధాకర్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం ఉద్యోగులకు సెంటనరీకాలనీ సెక్యూరిటీ కార్యాలయంలో ఎస్‌వోటూ జీఎం రఘుపతి క్వార్టర్స్ కౌన్సెలింగ్ నిర్వహించారు. 162 క్వార్టర్లు ఖాళీ ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, ఛేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కోసం 80 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 17మంది హాజరు కాగా 15 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డీవైపీఎంలు శ్రీహరి, సునీల్ ప్రసాద్, యూనియన్ల ప్రతినిధులు గౌతం శంకరయ్య, జూపాక రాంచందర్, కోట రవీందర్‌రెడ్డి, మామిడి స్వామి, కుమార్, మధునయ్య పాల్గొన్నారు.

డెంగీతో మహిళ మృతి!

ఓదెల(పెద్దపల్లి): ఓదెలకు చెందిన ఈర్ల రాజకుమారి(40) డెంగీ లక్షణాలతో శుక్రవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. 15 రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆమెను వరంగల్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయిందని పేర్కొన్నారు. ఆమె ఐకేపీలో గ్రామ సంఘం సహాయకురాలిగా పనిచేస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మృతిపై ఐకేపీ ఏపీఎం లతమంగేశ్వరీ, సీసీలు శ్రీనివాస్, మల్లయ్య, కొంరయ్య సంతాపం తెలిపారు.


ఎన్టీపీసీ పీటీఎస్‌లో పూజలు చేస్తున్న మహిళలు


పూజలు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్


పూజలు చేస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావు


అన్నదానం చేస్తున్న ఎన్టీపీసీ ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్

కుంకుమ పూజలు.. అన్నదానాలు

జ్యోతినగర్(రామగుండం): వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా వినాయక మంటపాల్లో శుక్రవారం కుంకుమ పూజలు, అన్నదానాలు నిర్వహించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ శ్రీవేంకటేశ్వరాలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. టీటీఎస్ గణేశ్‌మండపంలో జిల్లా రవాణా శాఖ అధికారి పి.రంగారావు, రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ భీంసింగ్, కృష్ణానగర్‌లో డీసీసీ అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, టెంపరరీ టౌన్‌షిప్‌లో ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులది దొంగ డిక్లరేషన్

• ప్రజా అంకితయాత్రలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్


పర్యటిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: దొంగడిక్లరేషన్లతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేయాలని చూస్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. కార్పొరేషన్‌లోని 11వ డివిజన్‌లో శుక్రవారం ఆయన బస్తీనిద్ర చేపట్టారు. ప్రజా అంకితయాత్ర నిర్వహించారు. సంక్షేమ పథకాల ప్రయోజనాల అందుతున్నాయా అని ఆరా తీశారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుస్తుందని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని అన్నారు. గత నాలుగున్నరేళ్లలో రెండేళ్లపాటు కరోనాతోనే సమయం వృథా అయిందని తెలిపారు. మిగిలిన రెండున్నరేళ్లలో రూ.కోట్లతో రామగుండంలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. మెడికల్ కళాశాల ప్రారంభించడంతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్‌కార్యాలయం, కోర్టు భవన సముదాయం ఏర్పాటు చేశామన్నారు. పనిచేసే ప్రభుత్వానికి, నాయకులకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి, కో ఆప్షన్ మెంబర్ చెరుకు బుచ్చిరెడ్డి, నాయకులు తోడేటి శంకర్‌గౌడ్, బొడ్డు రవీందర్, పర్లపెల్లి రవి, నారాయణదాసు మారుతి, అచ్చ వేణు, దాసరి ఎల్లయ్య, జేవీరాజు, వడ్డెపల్లి కాంత్రి, జిట్టవేణి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నలిమెల, విమలక్కకు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం


పురస్కారాలు అందుకుంటున్న నలిమెల, విమలక్క

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌కు చెందిన పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిలింభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్, అరుణోదయ కళాకారిణి విమలక్కకు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ నలిమెల భాస్కర్ నలభై ఏళ్లుగా తెలంగాణ భాష సేద్యం చేస్తున్నారని, ఆయనకు ఈ పురస్కారం రావడం మనందరికి దక్కినట్లేనన్నారు. నల్లరేగడి నేలలో ఎర్రని పాటలు పాడి.. ప్రజల మెదళ్లలో కొత్త ఆలోచనలను మొలకెత్తించే గొప్ప కార్యాన్ని చేపట్టిన విమలక్కకు ఈ అవార్డు దక్కడం గొప్ప విషయమని కొనియాడారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ట్రస్ట్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవిచంద్ర, ఉపాధ్యక్షుడు అశోక్, కవులు అన్నవరం దేవేందర్, పీఎస్ రవీంద్ర, మాడిశెట్టి గోపాల్, నంది శ్రీనివాస్, పొన్నం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఒకటిన మంత్రి కేటీఆర్ రాక



గోదావరిఖని: రాష్ట్రమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అక్టోబరు ఒకటో తేదీన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పర్యటిస్తారు. ఈమేరకు పార్టీ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 3న జాతీయ ఎన్నికల కమిషన్ అధికారులు రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో దీనికన్నా ముందుగానే ఆయన ఈప్రాంతానికి వచ్చి పలు అభివృద్ధి పనులు ప్రారంభించాలనే ఆలోచనలో ఎమ్మెల్యే చందర్ ఉన్నట్లు సమాచారం. ఇదేరోజు మంచిర్యాల జిల్లా మందమర్రిలో అధికారిక కార్యక్రమాలతోపాటు బహిరంగసభలో పాల్గొననున్నట్లు సమాచారం. అనంతరం రోడ్డు మార్గం ద్వారా గోదావరిఖనికి చేరుకుంటారు. తొలుత అంతర్గాం ఇండస్ట్రియల్ పార్క్, ఆతర్వాత మున్సిపల్ కార్యాలయం వెనకాల చేపట్టే ఐటీ టవర్స్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారని తెలుస్తోంది. అనంతరం ఎల్‌బీస్టేడియంలో నిర్వహించే భారీబహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లుగా తెలుస్తోంది.

పెద్దపల్లిలో బహిరంగ సభ

గోదావరిఖని పర్యటన తర్వాత పెద్దపల్లికి రోడ్డు మార్గం ద్వారా చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారని భావిస్తున్నారు. తొలుత మినీట్యాంక్‌బండ్‌కు పూజ చేశాక బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొనే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈపర్యటకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు. ఎమ్మెల్యేలు మాత్రం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమైయ్యారు.

ఎరియర్స్ చెల్లింపుపై వర్క్‌షీట్ అందించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల 11వ వేజ్‌బోర్డు ఎరియర్స్‌కు సంబంధించి వర్క్‌షీట్ అందించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదాయం పన్ను 30– 33 శాతం వరకు రికవరీ చేయడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. 20శాతం ఉన్నవారికి ఎక్కువగా కోత విధించడం అన్యాయమని నాయకులు ఎల్లాగౌడ్, కె.స్వామి పేర్కొన్నారు.


డబ్బాలో ఇరుక్కున శునకం తల


డబ్బా తొలగిస్తున్న ప్రతినిధులు

పాపం శునకానికేం తెలుసు..!

ఎలిగేడు(పెద్దపల్లి): ఆ శునకానికి బాగా ఆకలి వేసింది.. ఓ కిరాణంలోకి దూరింది.. ప్లాస్టిక్ డబ్బాలోని ఆహార పదార్థాలు ఆరగించింది.. ఆకిలి తీరింది కానీ.. తల డబ్బాలో ఇరుక్కుని ఆగమైంది.. తల బయటకు తీసుకునేందుకు శతవిధాలా ప్రయత్నించినా సఫలం కాలేదు... ఒకటికాదు.. రెండుకాదు.. సుమారు పది రోజులుగా డబ్బాలో ఉన్న తలతోనే ఊరంతా తిరిగింది. నీరులేక, తిండి తినలేక బక్కచిక్కింది. చివరకు ఆనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వలంటీర్లు పవన్, నందిని.. గ్రామస్తుల సహకారంతో శుక్రవారం శునకాన్ని పట్టుకున్నారు. తల నుంచి ప్లాస్టిక్ దాబ్బా తొలగించడంతో బతుకు జీవుడా అంటూ పరుగెత్తింది. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం నర్సాపూర్‌లో చోటుచేసుకుంది.

మరో 176 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండంలో మరో 176 మెగావాట్ల సామర్థ్యంగల సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి సంస్థ శ్రీకారం చుట్టింది. 120 మెగావాట్ల గ్రౌండ్ మౌంట్, 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పీవీ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి బిడ్ల స్వీకరణ ప్రారంభించింది. అక్టోబర్ 20వ తేదీన చివరి గడువుగా ప్రకటించారు. రామగుండం ప్రాజెక్టు ఆవరణ పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని స్థలంతోపాటు ఇతర ఖాళీ స్థలంలో 120 మెగావాట్ల గ్రౌండ్ మౌంట్ సోలార్ ప్రాజెక్టు, రిజర్వాయర్‌లో 56 మెగావాట్ల ఫొటో వోల్టాయిక్ మాడ్యూల్స్‌తో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ నిర్మించనుంది. సోలార్ ప్లాంట్ నిర్దేశిత ప్రాంతంలో ఫొటో వోల్టాయిక్ మాడ్యూళ్ల సరఫరా, ఇన్‌స్టాలేషన్ సహా సోలార్ పీవీ ప్లాంట్‌కు మూడేళ్ల ఆపరేషన్, మెయింటనెన్స్ కూడా బిడ్ పరిధిలో ఉంది.

100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్..

రిజర్వాయర్‌లో 100 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ఇప్పటికే నిర్మించింది. ఇందులో విద్యుత్ ఉత్పత్తి కూడా ప్రారంభించింది. రాజీవ్ రహదారి పక్కన ఉన్నస్థలంలో 10 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసింది. కొత్తగా 176 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు నిర్మిస్తే.. ఈ ప్రాంతంలో 286 మెగావాట్ల సౌరశక్తి విద్యుత్ అందుబాటులోకి వస్తుంది.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ప్రభాకర్

రామగిరి: తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తపాలా శాఖ అధికారి ప్రభాకర్ కోరారు. లద్నాపూర్ పోస్టాఫీసులో శుక్రవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ప్రతీవ్యక్తి తపాలా సేవలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో డాక్ కమ్యూనిటీ సేవలు చేపట్టామని తెలిపారు. పొదుపు, బీమా పథకాల గురించి ఆయన అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ విజయను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ అధికారి అరికాల నరేశ్, పీవోపీ డీవో బూరుగు అభిషేక్‌గౌడ్, సబ్ పోస్ట్‌మాస్టర్ నరేంద్రచారి, బీపీఎం వనం రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం


సందీప్

ధర్మారం: తెలంగాణ ఫార్మసిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కటికెనపల్లి గ్రామానికి చెందిన ఆవుల సందీప్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు మాడెం ప్రభాకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

'విద్యార్థులపై పోలీసుల దాడి హేయం'

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దపల్లి బాలికల ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమస్యలపై ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు దాడి చేయడం హేయమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాగమల్ల సురేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టవద్దని విద్యార్థులు నినదిస్తున్నా.. ప్రభుత్వ పెద్దలు ఏకపక్ష నిర్ణయాన్ని తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిరుపేదలు చదువుకునే ప్రభుత్వ కళాశాలలో విద్యావ్యవస్థను నీరుగార్చేందుకు కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు.

బొగ్గుబాయి వార్తలు

ఆందోళనలో సింగరేణి కార్మికులు



మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: 23నెలల ఎరియర్స్ విషయంలో కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. స్థానిక ప్రెస్ భవన్‌లో శుక్రవారం వారు మాట్లాడారు. ఎరియర్స్ చీటీలు ఇవ్వకుండా బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమచేయడం ద్వారా స్పష్టత లేకుండా పోయిందని తెలిపారు. ట్యాక్స్ పేరుతో కోతలు అధికంగా విధించారని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం స్పందించి ట్యాక్స్ కోతలు లేకుండా చెల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్.ప్రకాశ్, ఆర్జీ–2 బ్రాంచ్ ఇన్‌చార్జి రాజారత్నం, కార్యదర్శి జిగురు రవీందర్, నాయకులు అన్నారావు, తిరుపతి, రవికుమార్, రాజు, నర్సయ్య, సంపత్‌రెడ్డి, గట్టయ్య, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారి కుటుంబానికి చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లోని ఓసీపీ–2లో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన ఎం.వెంకటేశ్వర్లు కుటుంబానికి శుక్రవారం ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు రూ.21 లక్షల విలువైన చెక్కు అందజేశారు. ఆర్జీ–3, ఏపీఏ అధికారుల సంఘం ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో చెక్కు అందజేశారు. ఆర్జీ–3 డివిజన్ అధికారుల సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణ, ఏఎస్‌వో వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, అధికారులు నాగేశ్వర్‌రావు, శ్రావణ్‌కుమార్, సునీల్‌ప్రసాద్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో–22 ప్రకారం వేతతనాలు చెల్లించండి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని: జీవో–22 ప్రకారం సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని శుక్రవారం ఆర్జీ–2 జీఎం జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతలో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు సింగరేణి ఆస్పత్రిలో ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, నర్సరీ, సులభ్ వర్కర్లకు కనీస వేతనాలు, ఈపీఎఫ్ అమలు చేయాలని, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఉచిత మెడికల్, యూనిఫాం యాజమాన్యం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని కోరారు. పెయిడ్ హాలీడేస్, బెల్ట్‌క్లీనింగ్, సేల్‌పిక్కింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలన్నారు. ధర్నా నిర్వహించిన అనంతరం డీజీఎం పర్సనల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుర్ర తిరుపతి, రాజారత్నం, ఎల్.ప్రకాశ్, అన్నారావు, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో 'ఆర్జీ–1' విజయం


విజయం సాధించిన ఆర్జీ–1 జట్టు

గోదావరిఖని: వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో ఆర్జీ–1 జట్టు విజయం సాధించింది. యైటింక్లయిన్‌కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈపోటీల్లో ఆర్జీ–1 జట్టు విన్నర్‌గా, ఆర్జీ–2 జట్టు రన్నర్‌గా నిలిచాయి.

గణేశునికి 108 నైవేద్యాలతో నివేదన




గోదావరిఖని: స్థానిక బంగ్లాస్ ఏరియా గణపతి వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108రకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, లేడీస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయ భవనం నిర్మిస్తే ఊరుకునేది లేదు

• సీపీఎం జిల్లా కార్యదర్శి ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల ఆవరణలోని బాలికల జూనియర్ కాలేజీ భవనం కూల్చి జిల్లా గ్రంథాలయ భనం నిర్మిస్తే ఊరుకునేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ముత్యంరావు హెచ్చరించారు. పట్టణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలేజీ భవనం కూల్చి ఆ స్థలంలో గ్రంథాలయ భవనం నిర్మించొద్దని మంత్రి ఈశ్వర్‌కు వినతిపత్రం అందించేందుకు యత్నిస్తే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆరోపించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు జిల్లెల ప్రశాంత్‌పై భౌతికదాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. బాలికల కోసం ఉన్న ఒక్క కళాశాలను మూసివేయించేందుకు ప్రైవేట్ విద్యాసంస్థల అధిపతులు కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి లేకుండా గ్రంథాలయ భవన నిర్మాణానికి ఎలా శంకుస్థాపన చేశారో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు జ్యోతి, కల్లెపల్లి అశోక్, సీపెల్లి దిలీప్, నవీన్, శ్రీనివాస్, సురేశ్, లక్ష్మణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబర్స్ అసోసియేషన్ ఆవిర్భావం


మేజిక్ రాజా


అందె సదానందం

కోల్‌సిటీ: గోదావరిఖనిలో యూట్యూబర్స్ అసోసియేషన్ ఆవిర్భవించింది. స్థానిక మార్కండేయ కాలనీలో గురువారం రాత్రి నటీనటులు, నిర్మాతలు, దర్శకులు, సాంకేతిక నిపుణులు సమావేశమయ్యారు. రామగుండం ఏరియా యూట్యూబర్స్ అసోసియేషన్(రాయ) పేరిట సంఘం ప్రకటించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా దామెర శంకర్, సలహాదారుగా దయానర్సింగ్, అధ్యక్షుడిగా మేజిక్ రాజా, ఉపాధ్యక్షులుగా సిరిశెట్టి తిరుపతి, చంద్రపాల్, ప్రధాన కార్యదర్శిగా అందె సదానందం, సంయుక్త కార్యదర్శులుగా ఈదునూరి పద్మ, జక్కుల స్వప్న, కోశాధికారిగా దామెర రాజేశ్, ప్రచార కార్యదర్శిగా మూల శంకర్, కో ఆర్డినేటర్‌గా విజయ్ కుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లుగా జనగామ రాజనర్సు, రామస్వామి, కార్యవర్గ సభ్యులుగా రహీం, చందు, అంజన్న, శ్రీకాంత్, కళావతి, అనిల్, రవీందర్, సానగొండ రవీందర్, సూరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఎస్ అమరేందర్, దయానంద్‌గాంధీ, కుమార్ పటేల్, రమాకాంత్, నక్క శ్రీనివాస్, నెల్లి శ్రీకాంత్, బొడ్డుపల్లి రామ్మూర్తి, కల్యాణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ


విద్యార్థులను అభినందిస్తున్న ఏసీపీ

గోదావరిఖనిటౌన్: మార్షల్ ఆర్ట్స్, క్రీడల ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని, ఆత్మరక్షణకు ఇవి దోహదం చేస్తాయని రామగుండం ఏసీపీ తుల శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల మంచిర్యాలలో జరిగిన ఐదో తెలంగాణ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో గోదావరిఖనికి చెందిన 9మంది విద్యార్థులు పలు మెడల్స్ సాధించారు. వీరిని ఏసీపీ తన కార్యాలయంలో మెడల్స్‌తో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వీటి సాధన ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కాగా, ఎం.అక్షిత్‌రెడ్డి, ఎస్.సిరితేజ గోల్డ్ మెడల్స్, మిస్బా, శ్రేయాస్‌వర్మ, తేజశ్రీ సిల్వర్ మెడల్స్, నిహిర, ఆరాధ్య, నిహారిక, నిత్య, శ్రీమాన్, ఆర్యన్, గౌస్, అజయ్, ధర్మా బ్రాంజ్ మెడల్స్ సాధించారు. హుయాన్ చుగ్ కుంగ్‌ఫూ అకాడమీ మాస్టర్ రాజేశం, ప్రతినిధులు కె.వీరస్వామి, కె.రాములు, మధు తదితరులు పాల్గొన్నారు.